

ఘనంగా ఏక్తా దివస్

రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు నివాళి అర్పించారు.

- 10లో ▸



జిల్లాలో పాగా వేస్తం

ఉమ్మడి జిల్లాలోని అన్ని ఎమ్మెల్యే స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు కుసుమకుమార్ అన్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.5 /18.2

ఉదయం నుంచి చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది. చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముమ్మరంగా ఎక్సైజ్ తనిఖీలు

ఖలీల్‌వాడి : ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 9 నుంచి 30 వరకు జిల్లావ్యాప్తంగా 165లీటర్ల సారా, 21,525లీటర్ల బెల్లం ఊట, 19,905లీటర్ల కల్లు, 412.13లీటర్ల మద్యం, 408.85లీటర్ల బీరు, 5.61లీటర్ల దేశీదారు, 7.93లీటర్ల మహారాష్ట్ర నాన్ డ్యూటీ లిక్కర్ పట్టుకున్నట్లు వివరించారు. 1,266 కేజీల నల్ల బెల్లం, 179కేజీల పటిక, 5కేజీల క్లోరల్ హైడ్రేట్, 39.9కేజీల గంజాయి, 20గంజాయి మొక్కలు, రెండు ఫోర్ వీలర్స్, ఆరు టూ వీలర్స్ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా రూ.66,15,255 విలువ గల మద్యం, గంజాయి తదితర మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో కంట్రోల్ రూం (08462–237601) ఏర్పాటు చేశామన్నారు. అక్రమంగా మద్యం తరలిస్తే కంట్రోల్ రూం నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

2న టీజీవో కార్యవర్గ సమావేశం

సుభాష్‌నగర్ : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) జిల్లా కార్యవర్గ సమావేశం ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటర్ కె శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన 2న మధ్యాహ్నం 3 గంటలకు టీఎన్‌జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు టీజీవో జిల్లా అధ్యక్షుడు సంగం అమృత్‌కుమార్ తెలిపారు. సమావేశానికి టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ గౌడ్ తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, యూనియన్ నాయకులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్మూర్‌లో కేసీఆర్ సభకు భారీ ఏర్పాట్లు



ఆర్మూర్ : ఆర్మూర్‌లో ఈ నెల 3న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభకు బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్మూర్ శివారులో 63వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకొని ఆలూరు బైపాస్ రోడ్, సిద్ధుల గుట్ట దగ్గర 15 ఎకరాల స్థలాన్ని సభ కోసం ఎంపిక చేశారు. సభాస్థలి వద్ద చేస్తున్న ఏర్పాట్లను బీఆర్‌ఎస్ ఆర్మూర్ అభ్యర్థి ఆశన్నగారి జీవన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. మరో వైపు సీఎం సభను విజయవంతం చేసి తమ బలాన్ని ప్రదర్శించాలనే సంకల్పంతో బీఆర్ఎస్ శ్రేణులు నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సతీమణి రజితరెడ్డి స్వయంగా గ్రామాల్లో పర్యటిస్తూ తన భర్త జీవన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహిస్తూనే సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని కోరుతున్నారు. కేసీఆర్ సభకు హాజరు కావాలని కోరుతూ పట్టణంలో గల అన్ని కుల సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు.

నామినేషన్ ప్రాంతాల్లో 144 సెక్షన్

ఖలీల్‌వాడి : అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 3 నుంచి 10 వరకు కొనసాగనుంది. జిల్లాలో నామినేషన్లు స్వీకరించే ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న నామినేషన్ల విత్ డ్రా ఉన్న సందర్భంగా ఆయా ప్రాంతాల్లో బందోబస్తు ఉంటుందని పేర్కొన్నారు. ఆర్మూర్ తహసీల్ కార్యాలయం, బోధన్ ఆర్డీవో కార్యాలయం, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ న్యూ బిల్డింగ్(నిజామాబాద్ అర్బన్), నిజామాబాద్ ఆర్డీవో ఆఫీస్, పాత మున్సిపల్ కమిషనర్ ఆఫీస్ బిల్డింగ్(నిజామాబాద్ రూరల్), భీమ్‌గల్ ఎంపీడీవో కార్యాలయం(బాల్కొండ)లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో ఐదుగురి కన్నా ఎక్కువ మంది గుమికూడవద్దన్నారు.

ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

సుభాష్‌నగర్ : శాసనసభ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని, అలాంటి వార్తలను ప్రసారం, ప్రింట్ చేయొద్దన్నారు. నవంబర్ 7 ఉదయం 6:30 గంటల నుంచి నవంబర్ 30 సాయంత్రం 6:30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం ఉంటుందని స్పష్టం చేశారు.



మాచారెడ్డి సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

బీఆర్‌ఎస్‌లో కేటీఆర్ జోష్

- కామారెడ్డి పట్టణం, మాచారెడ్డిలో ఆకట్టుకున్న ప్రసంగం
- భూముల ధరలు పెరుగుతాయి.. అమ్ముకోవద్దని సూచన
- పక్క జిల్లాల రూపురేఖలూ మార్చుతామని హామీ

కామారెడ్డి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండగా.. ఆయన కుమారుడు మంత్రి కేటీఆర్ ఉత్తేజపూరిత ప్రచారంతో ప్రజల్ని, ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులలో, ఓటర్లలో జోష్‌ను నింపుతున్నారు. మంగళవారం కామారెడ్డి నియోజకవర్గంలోని మాచారెడ్డి, రామారెడ్డి మండలాలకు సంబంధించి మాచారెడ్డి చౌరస్తా వద్ద సభలో, మధ్యాహ్నం కామారెడ్డి పట్టణంలోని వీక్లీమార్కెట్‌లో ప్రసంగించారు.

సాక్షి, కామారెడ్డి/ కామారెడ్డి టౌన్/ మాచారెడ్డి : కామారెడ్డిలో కేటీఆర్ సభల కారణంగా కార్యకర్తల్లో మరింత జోష్ పెరిగింది. మంగళవారం జరిగిన రెండు సభల్లోనూ మంత్రి కేటీఆర్ తనదైన శైలిలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెబుతూనే ప్రతిపక్షాలపై పంచ్‌లు విసిరారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలు కామారెడ్డి వైపే చూస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్ పోటీ చేయడం, గెలుపు ఖాయమని ఇక నియోజకవర్గం అభివృద్ధి 300 కి.మీ వేగంతో దూసుకెళ్లడం ఖాయమన్నారు. ఇక కామారెడ్డి రూపు రేఖలు మారిపోతాయన్నారు. కామారెడ్డి దశ, దిశ మారాలని పట్టుపట్టిన గంప గోవర్ధన్ కేసీఆర్‌ను ఇక్కడి నుంచే పోటీ చేయాలని కోరడం ఆయన మంచితనమన్నారు.

దుమ్ము రేపాలి.. దుమ్ము చూపాలి

నవంబర్ 9వ తేదీన కేసీఆర్ నామినేషన్ రోజు నియోజక ప్రజలు దుమ్ము రేపాలని కేటీఆర్ అన్నారు. కామారెడ్డిలో ఎంతో కొంత పేరున్న షబ్బీర్ అలీ కేసీఆర్‌పై పోటీ చేయడానికి భయపడుతున్నారన్నారు. ఉద్యమంలో అడ్రస్ లేని రేవంత్ రెడ్డి ఇక్కడికి వచ్చి ఏం చేస్తాడో అని విమర్శించారు. ప్రజల్ని, రైతులను మభ్యపెట్టి మరో వ్యక్తి పోటీకి దిగుతున్నాడని బీజేపీ అభ్యర్థిని ఎద్దేవా చేశారు. కామారెడ్డి మాస్టర్ ప్లాన్ పూర్తిగా రద్దు చేశామని, పాత మాస్టర్ ప్లాన్ ప్రస్తుతం అమలులో ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

గజ్వేల్ తరహా అభివృద్ధి

కేసీఆర్ కామారెడ్డిలో ఎందుకు పోటీ చేస్తున్నారనే విషయంపై కేటీఆర్ క్లారిటీ ఇచ్చారు. ఇక్కడ భూములను కేసీఆర్ గుంజుకోడానికి రావడం లేదని, ధరల పెంచేందుకే వస్తున్నాడన్నారు. గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(గడా) ఏర్పాటు చేసి అభివృద్ధి చేసినట్లు కామారెడ్డిని అభివృద్ధి చేస్తామన్నారు. దీంతోపాటు జిల్లా కేంద్రానికి 50 కి.మీ దూరంలో ఉన్న మెదక్, సిరిసిల్లా, నిజామాబాద్ జిల్లాకు ఫోర్ వే రోడ్లైన్‌లను వేసి అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్రంలోనే కామారెడ్డి ఆదర్శ పట్టణంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఓటర్లు ఓటును ఖరాబ్ చేసుకోవద్దన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని, లక్షకుపైగా మెజార్టీ ఇవ్వాలని ప్రభుత్వ గంపగోవర్ధన్ కోరారు. ఎక్కడ జరగని అభివృద్ధి కామారెడ్డిలో చేసి చూపిస్తామన్నారు. శరవేగంగా కామారెడ్డి అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. కేసీఆర్ గెలిపించుకుందామన్నారు. – గంప గోవర్ధన్, ఎమ్మెల్యే

యెండలకు బాన్సువాడ?

- ఆలోచన చేస్తున్న బీజేపీ నాయకత్వం
- బోధన్ టికెట్ కోసం మేడపాటి, వడ్డి మధ్య పోటాపోటీ
- నిజామాబాద్ రూరల్ నుంచి కులాచారి దినేశ్‌కే చాన్స్!

సాక్షిప్రతినిధి, నిజామాబాద్ : భారతీయ జనతా పార్టీ బాన్సువాడ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణను బరిలోకి దించేందుకు పార్టీ నాయకత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ టికెట్ కోసం రేసులో ఉన్న మాల్యాద్రిరెడ్డి తాజాగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ టికెట్ కోసం బీజేపీ నాయకులు కార్గె శ్రీనివాస్, పైడిమల్ లక్ష్మీనారాయణ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటివరకు బీజేపీలో మాల్యాద్రిరెడ్డి అనుచరులుగా వ్యవహరించిన నాయకులు మాత్రం పైడిమల్ లక్ష్మీనారాయణకే టికెట్ ఇవ్వాలని కోరుతున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు మాత్రం కార్గె శ్రీనివాస్‌కు మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో తాజాగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణకు ఈ స్థానం కేటాయించనున్నట్లు తెలుస్తోంది. సంఘపరివార్ నుంచి వచ్చిన యెండల బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఉంటూ పార్టీ అప్పగించిన వివిధ బాధ్యతలను నెరవేరుస్తూ వస్తున్నారు. యెండల నిజామాబాద్ అర్బన్ నుంచి గతంలో రెండుసార్లు విజయం సాధించారు. మరోసారి ఈ టికెట్‌ను యెండల ఆశించినప్పటికీ ఎంపీ అనుచరుడు ధన్‌పాల్ సూర్యనారాయణకు ఈ దక్కింది. ఈ టికెట్ దక్కకపోవడంతో యెండల నిజామాబాద్ రూరల్ లేదా బోధన్ టికెట్ ఆశించారు. అయితే ఈ టికెట్ల రేసులో ఎంపీ అనుచరులు కులాచారి దినేశ్, మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డి మోహన్‌రెడ్డిలు ఉన్నారు. ఈ నేపథ్యంలో అర్వింద్ ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ పార్లమెంట్ పరిధిని దాటి జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని బాన్సువాడ నుంచి యెండలను బరిలోకి దించేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. బాన్సువాడ స్థానంలో మున్నూరుకాపు ఓట్లు గణనీయంగా ఉన్న నేపథ్యంలో, ఆ సామాజిక వర్గానికి చెందిన సంఘ్ నేపథ్యం కలిగి ఉన్న యెండల అయితే బాగుంటుందనే చర్చ పార్టీలో జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం నిజామాబాద్ రూరల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్ సైతం గతంలో కాంగ్రెస్ నుంచి బాన్సువాడ బరిలో దిగి పోచారం శ్రీనివాసరెడ్డిపై విజయం సాధించారు. ఈ క్రమంలో శాసనసభ స్పీకర్లుగా పనిచేసినవారు తరువాతి ఎన్నికల్లో ఓటమిపాలవుతారనే సెంటిమెంట్ ఉన్న నేపథ్యంలో బలమైన మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన యెండల అయితే మంచి ఫలితముంటుందనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అదేవిధంగా ప్రభుత్వ వ్యతిరేకత సైతం కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఈ స్థానం కేటాయిస్తే బరిలోకి దిగేందుకు యెండల సైతం సుముఖంగా ఉన్నట్లు సమాచారం.



కాంగ్రెస్ అభ్యర్థి సైతం మరోచోట నుంచే..

కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ రేసులో కాసుల బాలరాజు ఉండగా, ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎల్లారెడ్డికి చెందిన రవీందర్‌రెడ్డికి ఈ టిక్కెట్టు కేటాయించనున్నట్లు చర్చ జరుగుతోంది. ఎల్లారెడ్డి అభ్యర్థి మదన్‌మోహన్ వర్గీయులు సైతం ఏనుగు రవీందర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నారు. బీజేపీ నుంచి తాజాగా కాంగ్రెస్‌లో చేరిన మాల్యాద్రిరెడ్డి సైతం ఏనుగు రవీందర్‌రెడ్డికి అయితేనే మద్దతు ఇస్తానని చెబుతుండడం గమనార్హం.

సీఎం సభకు ప్రజలు తరలివస్తారు



వేల్పూర్ స్పైస్ పార్కులో సీఎం సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- సభ ఏర్పాట్ల పరిశీలన

వేల్పూర్ : వేల్పూర్‌లోని స్పైస్ పార్కులో గురువారం జరిగే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా తరలి వస్తారని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం సభ ఏర్పాట్లను పరిశీలించి ఆయన మాట్లాడారు. న భూతో, న భవిష్యత్ అన్న విధంగా సభ నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని తెలంగాణాలో అభివృద్ధి జరిగిందన్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఆయనపై దాడి చేసిన వ్యక్తి కాంగ్రెస్ కార్యకర్త అని ఆరోపించారు. దాడికి నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం రాష్ట్రంలోని అన్ని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేస్తాయని వెల్లడించారు. కాంగ్రెస్‌లో 10 మంది సీఎం అభ్యర్థులు ఉంటారని, పొరపాటున ఆ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందన్నారు. నాయకులు కుంట రమేశ్‌రెడ్డి, మార గంగారెడ్డి, రాజారాం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వలస ఓటర్లకు గాలం

- ప్రత్యేక బృందాల ఏర్పాటు
- సమాచారం సేకరిస్తున్న ప్రధాన పార్టీలు
- కులసంఘాలతో మంతనాలు

జంగ్ తెలంగాణ

ఖలీల్‌వాడి : శాసనసభ ఎన్నికలు నవంబర్ 30న ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులు వలస ఓటర్ల కోసం గాలం వేస్తున్నారు. గెలుపు కోసం బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు వలసదారులపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికలలో గెలుపు ఓటములపై కీలకంగా వ్యవహరించే వలస ఓటర్లపై వివరాలను ప్రధాన పార్టీలు సేకరిస్తున్నాయి. జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్‌లో ముంబాయి, భీమండి, పుణే, సూరత్, షోలాపూర్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో పనిచేసే వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లో 10 వేల మంది ఓటర్లు ఉంటారని ప్రధాన పార్టీలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వలస వెళ్లిన ఓటర్లకు సంబంధించిన బంధువులతో ప్రధాన పార్టీలకు చెందిన నేతలు టచ్‌లోకి వెళ్లి ఎన్నికల నాటికి ఓట్లు వేయించుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎన్నికల కోసం వచ్చే వలస ఓటర్లకయ్యే ఖర్చులను రాజకీయపార్టీలు భరిస్తాయనే చర్చ జిల్లాలో కొనసాగుతుంది.

జోరుగా ఆత్మీయ సమ్మేళనాలు..

ప్రధాన రాజకీయపార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాయి. నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్ పార్టీ మాత్రం అభ్యర్థిని ప్రకటించలేదు. మిగితా పార్టీలు కులసంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నాయి. గ్రామాలు, పట్టణంలోని వార్డులలో ఉన్న ప్రధాన కులాలకు చెందిన సంఘాలతో ప్రధాన పార్టీలకు చెందిన నేతలు మంతనాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలోని కులసంఘాల పెద్దలకు రాజకీయనాయకులు మచ్చికలు చేసుకునేందుకు విందుభోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న అతిపెద్దగా ఉన్న కులసంఘాల నేతలను అన్ని పార్టీలకు చెంది అభ్యర్థులు కలిసి తమను గెలిపించాలని విన్నవిస్తున్నట్లు తెలుస్తోంది, కులసంఘాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నేతలు అభ్యర్థులను కలిపిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికలలో గెలుపొందిన తర్వాత ఇచ్చే తాయిలాల గురించి పార్టీ అభ్యర్థులు కులసంఘాల నేతలకు హామీల వర్షం కురిపిస్తున్నారు. గ్రామాల వారీగా, పట్టణాలలో వార్డుల వారీగా ప్రధాన పార్టీల నేతలు వారి అనుచరగణంకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.



స్థానిక నేతలతో రాయబారాలు..

నియోజకవర్గంలోని గ్రామాల్లో ఉన్న వారి వివరాలను స్థానిక నేతలతో కలిసి వివరాలు సేకరిస్తున్నారు. గ్రామాల్లో వారికి సంబంధించిన బంధువులు, కుటుంబసభ్యులతో మాట్లాడి వారి ఫోన్ నెంబర్లు తీసుకొని వారిని ఎలక్షన్ వరకు ఇంటి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వలస కార్మికులను నవంబర్ 30 నాటికి ఓట్లు వేయడానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నాయి. హైదరాబాద్ ప్రాంతంలో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో మాట్లాడుతున్నారు. అంతేకాకుండా ఓటర్లు ఉన్న ఫోన్ నెంబర్లకు తమ పార్టీని అభ్యర్థులను గెలిపించాలని సందేశాలు చేస్తున్నారు.

కలిసొచ్చిన ఖరీఫ్

- జిల్లాలో సంతృప్తికరంగా వరి దిగుబడి
- ఎకరానికి 30 క్వింటాళ్లు ..
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు



డొంకేశ్వర్ మండలం తొండాకూర్‌లో వరిని కోస్తున్న యంత్రం

డొంకేశ్వర్ : ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతులకు కలిసొచ్చింది. వర్షాలు, ప్రతీకూల వాతవరణ పరిస్థితుల్లో సైతం వరి పంట గట్టెక్కింది. ప్రస్తుతం కోతలు మొదలుకావడంతో పంట దిగుబడి సంతృప్తికరంగా ఉంది. సన్నాలు, దొడ్డు రకాల్లో ఎకరానికి 26–30 క్వింటాళ్ల వరకు వస్తోంది. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దిగుబడితో పాటు పంటకు మంచి రేటు ఉండడంతో కొంత మంది రైతులు పచ్చి ధాన్యాన్ని వ్యాపారులకు విక్రస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కూడా తెరవడంతో కోసిన ధాన్యాన్ని ఆరబోసేందుకు కల్లాలకు తరలిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో 4.17లక్షల ఎకరాల్లో వరిపంట సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, రైతులు 4లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో దొడ్డు రకాలు ఎక్కువగా ఉండగా, బీపీటీ, జైశ్రీరాం లాంటి సన్నాలు తక్కువ ఎకరాల్లో సాగైంది. వర్షాల కారణంగా సోయా, మక్క పంటలకు వైరస్ సోకి దెబ్బతిన్నాయి. కానీ వరి ప్రతీకూల వాతావరణాన్ని తట్టుకుంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం వరిని దోమ, తెగుళ్ల ఆశించినప్పటికీ పెద్దగా నష్టం జరగలేదు. ఎకరానికి 25 క్వింటాళ్లకు పరిమితమైన వరి దిగుబడి గత రెండు సీజన్ల నుంచి 30 క్వింటాళ్ల వరకు వస్తోంది. పెట్టుబడి, కూలీలు, ఇతర ఖర్చులు పోను లాభం చేకూరుతోందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ఏ–గ్రేడు రకం క్వింటాలు ధాన్యానికి రూ.2,203 మద్దతు ధర ఇస్తోంది. కామన్ రకానికి రూ.2,183 చెల్లిస్తోంది. ఇటు వ్యాపారులు కూడా పచ్చిపంటను క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.2వేల వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారు. రైతులకు కూడా వెంటనే డబ్బులు కూడా చెల్లిస్తున్నారు. జైశ్రీరాం వెరైటీకి క్వింటాలు రూ.2,600కు పైగా ధర పలుకుతోంది.

కోత రేట్ల పెంపు

జిల్లా వ్యాప్తంగా వరికోతలు ఊపందుకున్నాయి. దీంతో వరికోత యంత్రాలకు డిమాండ్ పెరగడంతో యజమానులు వాటి రేట్లను భారీగా పెంచేశారు. చైన్‌తో నడిచే మిషిన్‌కైతే గంటకు రూ.3,800 నుంచి రూ.4వేల వరకు తీసుకుంటున్నారు. అదే టైర్లతో నడిచేదానికి గంటకు రూ.2,500 వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. కోత యంత్రాల రేట్లు ప్రతీ ఏడాది పెరుగుతూనే ఉన్నాయి. ధరలను అధికారులు నియంత్రించడం లేదు. దీంతో వారు చెప్పినంత ఇవ్వాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలో ప్రస్తుతం బాన్సువాడ, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో కోతలు దాదాపుగా సగం పూర్తయ్యాయి. ఆర్మూర్, బాల్కొండ ప్రాంతాల్లో కూడా కోతలు మొదలయ్యాయి.

ఆశాజనకంగా దిగుబడి



ఇటీవల వరిపంట కోశాను. ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ సీజన్‌లో ఆశాజనకంగా దిగుబడి రావడంతో సంతోషంగా ఉంది. వరికోత యంత్రాల ధరలను అధికారులు నియంత్రిస్తే రైతులకు మేలు జరుగుతుంది.
– గోక గంగారెడ్డి, రైతు, డొంకేశ్వర్

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి


- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సూచనలు చేస్తున్న కలెక్టర్

సుభాష్‌నగర్ : పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎలాంటి సందేహాలున్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్ల ద్వారా నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫెసిలిటేషన్ సెంటర్లు, పీవోలు, ఏపీవోలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, ఇతర పోలింగ్ సామగ్రిని పరిశీలించి అందరికీ పంపిణీ చేసేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ఈ సారి అన్ని వంద శాతం సీసీ కెమెరాల నిఘాలో పోలింగ్ నిర్వహిస్తున్నందున ప్రతి అంశం రికార్డింగ్ అవుతుందని తెలిపారు. పోలింగ్ రోజు ఏజెంట్ల సమక్షంలో ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. పంపిణీ కేంద్రంలో కేటాయించిన ఈవీఎంలను తీసుకొని నిర్దేశించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకోవాలని, ఇతర వేరే ఏ ప్రాంతాలకు కూడా వెళ్లకూడదని ఆదేశించారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ ఉన్నారు.

కమలం గూటికి సుభాష్‌రెడ్డి!



సాక్షి, కామారెడ్డి : పీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కమలం గూటికి చేరనున్నారు. ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ కోసం చివరిదాకా ప్రయత్నించిన సుభాష్‌రెడ్డి తీవ్ర నిరాశకు లోనయ్యారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ జాతీయ నాయకుల నుంచి ఆహ్వానం అందడంతో ఆ పార్టీలో చేరేందు కు నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా బుధవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మల్యాద్రిరెడ్డి



వర్ని: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి మాల్యాద్రిరెడ్డి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు వర్ని మాజీ జెడ్పీటీసీ రంజ్యా నాయక్‌తో పాటు మరో 15 మంది బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

క్లుప్తంగా

అర్చరీ నేషనల్‌ గేమ్స్‌ అబ్జర్వర్‌గా సంజీవరెడ్డి



నిజామాబాద్‌నాగారం: గోవాలో జరుగుతున్న నేషనల్‌ గేమ్స్‌కు జిల్లా అర్చరీ అధ్యక్షుడు, ఒలింపిక్‌ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవరెడ్డి అర్చరీ గేమ్స్‌ అబ్జర్వర్‌గా ఎంపికకైనట్లు హైదరాబాద్‌ అర్చరీ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి అరవింద్‌ ప్రకటనలో తెలిపారు. సంజీవరెడ్డి అబ్జర్వర్‌గా వ్యవహరించడంతో జిల్లా క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ ప్రదానం

నిజామాబాద్‌ అర్బన్‌: గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వాణిజ్య శాస్త్ర అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పీవీవీ సత్యవరప్రసాద్‌కు పీహెచ్‌డీ అవార్డు లభించింది. స్వామి రామానంద తీర్థ మరాత్వాడ యూనివర్సిటీ నాందేడ్‌ వారు ఈ పీహెచ్‌డీని ప్రదానం చేశారు. సత్య వరప్రసాద్‌ ముద్ర యోజనలో స్పెషల్‌ రిఫరెన్స్‌ అనే అంశం ప్రసంగించారు. దీనికి గాను పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

రుద్రూర్‌ వాసికి..



రుద్రూర్‌: రుద్రూర్‌ గ్రామానికి చెందిన విశ్వనాథ్‌ మహాజన్‌ ఫిలాసఫీ సబ్జెక్ట్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ పట్టా అందుకున్నారు. ఓయూ 83వ వార్షికోత్సవంలో మంగళవారం గవర్నర్‌ చాన్సలర్‌ ఆఫ్‌ ఉస్మానియా యూనివర్సిటీ సీఈవో సుందర రాజన్‌, వైస్‌ చాన్సలర్‌ రవీందర్‌ చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. అనంతరం విశ్వనాథ్‌ మహాజన్‌ను గ్రామ ప్రముఖులు అభినందించారు.

రిపబ్లిక్‌ డే పరేడ్‌కు విద్యార్థిని ఎంపిక

నిజామాబాద్‌ అర్బన్‌: విజయవాడలో వెస్ట్‌ జోన్‌ ప్రీ రిపబ్లిక్‌ డే పరేడ్‌కు గిరిరాజ్‌ కళాశాలకు చెందిన విద్యార్థిని జె.మమత ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ రామ్మోహన్‌ రెడ్డి మంగళవారం తెలిపారు. కళాశాలలో మమత బీకాం తృతీయ సంవత్సరం చదువుతోంది. నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు విజయవాడలో వెస్ట్‌ జోన్‌ ప్రీ రిపబ్లిక్‌ డే క్యాంపు కొనసాగుతుందని ఇందులో మమత పాల్గొంటుందని ప్రిన్సిపాల్‌ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినిని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఖర్చుల లెక్క పక్కాగా ఉండాలి

- లెక్క తప్పితే తిప్పలే
- రూ.40 లక్షలకు మించి ఖర్చు ఉండొద్దు



ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. అభ్యర్థులు ఎన్నికల్లో రోజు వారీగా చేసే ఖర్చులకు లెక్క పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అభ్యర్థులు ప్రతి రోజు చేసిన ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘానికి అందించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో అభ్యర్థి రూ. 40 లక్షలకు మించి ఖర్చు చేయరాదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎక్కువ ఖర్చు చేస్తే ఎన్నికల సంఘం వేటు వేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల్లో చేసే రోజువారీ ఖర్చులకు సంబంధించిన వివరాలపై ఎన్నికల పరిశీలకులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. నవంబర్‌ 3 నుంచి ఎన్నికల నామినేషన్‌ దాఖలు చేసిన నాటి నుంచి ఎన్నికలు ముగింపు వరకు ఎన్నికల కోసం ఖర్చు చేసే వివరాలను రోజు వారీగా లెక్క చెప్పాల్సి ఉంటుంది. పట్టణం, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారం కోసం అవసరమైన ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘం ముందుగానే విడుదల చేసింది.

ఎన్నికల అధికారుల నిరంతర నిఘా..

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. అభ్యర్థులు చేసే ఖర్చులకు సంబంధించిన వాటిపై వ్యయ పరిశీలకులు నిరంతరం నిఘాను ఏర్పాటు చేస్తున్నారు. రోజువారీ ఖర్చులకు సంబంధించిన వివరాలను వ్యయ పరిశీలకులు అభ్యర్థులకు షాడోగా ఉంటూ ఖర్చులకు సంబంధించిన వివరాలను సేకరిస్తారు. అభ్యర్థులు ప్రచారంలో చేసిన ఖర్చులకు సంబంధించిన వివరాలను రెండు రోజులకోక్కసారి ఎన్నికల అధికారులకు అందించాల్సి ఉంటుంది. లేకుంటే ఎన్నికల అధికారులు అభ్యర్థులకు నోటీసులు జారీ చేస్తారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలు

సామగ్రి	గ్రామీణం	పట్టణం	సామగ్రి	గ్రామీణం	పట్టణం	సామగ్రి	గ్రామీణం	పట్టణం
యాంప్లీఫైర్‌, మైక్రోఫోన్‌	300	300	డ్రైవర్‌తో సహా జీపు, డీజిల్‌	2000	2000	చికెన్‌ బిర్యాని	100	140
10x12 ఫ్లెక్సీ పరిమాణం	1200	1200	ట్రక్కు, టెంపో, డీజిల్‌తోపాటు	3500	3500	మటన్‌ బిర్యాని	150	180
క్లాత్‌ చిన్నది(1/2x1)	30	30	డ్రైవర్‌కు			స్టేజ్‌ డెకరేషన్‌	1500	2000
క్లాత్‌ బ్యానర్‌(11/2x5)	200	200	టీ	8	10	బైక్‌లకు పెట్రోల్‌	150	150
పోడియం పెండర్‌ నిర్మాణం	2000	2000	ఫంక్షన్‌ హాల్‌	12000	15000	లౌడ్‌ స్పీకర్లు	800	900
(8x8)			కోలాట బృందాలు(ఒక్కొక్కరికి)	450	500	టిఫిన్‌	30	35
కటౌట్లు(వస్త్రం, ప్లాస్టిక్‌)	5,000	5,000	వాహనాలకు ఎల్‌ఈడీ స్క్రీన్లు	1800	1800	భోజనం	80	80
కార్మికులతో సహా హోర్డింగులు	5,000	5,000	(రోజు ఖర్చు)			డ్రోన్‌కెమెరా	3000	3000
కెమెరాతో సహా వీడియోగ్రాఫర్‌	1800	1800	ఎల్‌ఈడీ స్క్రీన్లు	10000	10000	మినీ బస్సు	3500	3500

ఉమ్మడి జిల్లాలో పాగా వేస్తాం

- తొమ్మిది అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటాం
- కాంగ్రెస్‌ జిల్లా ఎన్నికల పరిశీలకుడు జెట్టి కుసుమ కుమార్‌


మాట్లాడుతున్న జెట్టి కుసుమ కుమార్‌

ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది ఎమ్మెల్యే స్థానాలను కాంగ్రెస్‌ పార్టీ కైవసం చేసుకుంటుందని కాంగ్రెస్‌ జిల్లా ఎన్నికల పరిశీలకుడు జెట్టి కుసుమ కుమార్‌ ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సార్లు రాష్ట్రంలో అధికారంలో లేనప్పటికీ కాంగ్రెస్‌ పార్టీ ఉమ్మడి జిల్లాలో పటిష్టంగా ఉందన్నారు. కర్ణాటక క్యాడర్‌ మాదిరిగానే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌ పార్టీ ఉండడంతో పార్టీ గెలుస్తుందని తెలిపారు. కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే ఖచ్చితంగా మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్నింటిని నెరవేరుస్తుందన్నారు. కేసీఆర్‌ ప్రభుత్వం చేసిన అరాచకాలు అవినీతితో ప్రజలు విసిగి వేసారి పోయారని అన్నారు. కర్ణాటకలో సంక్షేమ పథకాలను పరిశీలించడానికి కేసీఆర్‌ తోపాటు మంత్రి వర్గసభ్యులకు చూపిస్తానని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి శివకుమార్‌ గౌడ చేసిన సవాల్‌ను బీఆర్‌ఎస్‌ నేతలు స్వీకరించలేదన్నారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ 39వ వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్‌ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్‌ భవన్‌ నందు ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనని వాళులు అర్పించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌ బిన్‌ హందన్‌, పార్టీ నగర అధ్యక్షుడు కేశవేణు, రూరల్‌ ఎమ్మెల్యే అభ్యర్థి భూపతి రెడ్డి, మాజీ మేయర్‌ సంజయ్‌, ఎ.సత్యనారాయణ, కౌశల్‌ సమీర్‌, ముప్పా గంగారెడ్డి, విక్కీ యాదవ్‌, వేణు రాజ్‌, సంతోష్‌, విజయలక్ష్మి, చంద్రకళ, ఉష, ప్రీతం, ఎజాజ్‌, రేవతి, గాజుల సుజాత, మొహమ్మద్‌ ఈసా, విజయ్‌ పాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటు అమ్ముకోవద్దు..

మోర్తాడ్‌: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటు అమ్ముకోవద్దు అంటూ ప్రజలను చైతన్యం చేసే పోస్టింగ్‌లు జోరుగా ట్రోల్‌ అవుతున్నాయి. సంతలో గేదె, ఎద్దు, మేక, పంది, కుక్కలకు ఉన్న విలువ మనిషి ఓటుకు లేదని కేవలం రూ.500 నుంచి రూ.5వేలకు ఓటు అమ్మినా దాని విలువ చాలా తక్కువ అని వివరంగా చెబుతూ చిత్రాలను ముద్రించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. కొందరైతే తమ ఓటు అమ్ముకోవడం లేదని తమ వారికి ఉచిత విద్య, వైద్యం, ఆర్థికంగా తాము స్థిరపడటానికి అవసరమైన ప్రోత్సాహం కావాలని అని పోస్టు చేస్తున్నారు. ఎవరు చేసినా ప్రజలను చైతన్యవంతులను చేసే విధంగా పోస్టింగ్‌ల ఉండటం విశేషం. మరి ప్రజలు ఎలా వ్యవహరిస్తారో ఎలాంటి తీర్పు ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.


సామాజిక మాధ్యమాల్లో ట్రోల్‌ అవుతున్న చిత్రం

ఘనంగా ఏక్తా దివస్‌


ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్‌, అధికారులు

సుభాష్‌నగర్‌: రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. జిల్లా పాలనాధికారి రాజీవ్‌ గాంధీ హనుమంతు కలెక్టరేట్‌ అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకితభావంతో కృషి చేస్తానని, సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను పటిష్టపర్చేందుకు తోడ్పాటు అందిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎస్‌ పద్మశ్రీ, కలెక్టరేట్‌ ఏవో ప్రశాంత్‌, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ జయంతిని ఘనంగా నిర్వహించారు. బార్‌ అసోసియేషన్‌ హాల్‌లో పటేల్‌ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దేవిదాస్‌, ఉపాధ్యక్షుడు ఆశనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు


ప్రతిజ్ఞ చేస్తున్న డీసీపీలు, సిబ్బంది

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో..

ఖలీల్‌వాడి: రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను పురస్కరించుకుని సీపీ కార్యాలయంలో డీసీపీలు, పోలీసు సిబ్బంది మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీసీపీలు జయరాం, గిరిరాజు, సీసీఆర్‌బీ, ఏసీపీ రవీందర్‌ రెడ్డి, సైబర్‌ సెక్యూరిటీ ఏసీపీ వేణు గోపాల్‌ రెడ్డి, రిజర్వు సీఐ, ఆఫీస్‌ సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఎంఆర్‌ షీట్లపై అవగాహన కల్పించాలి

మోపాల్‌: ఓఎంఆర్‌ షీట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఈవో దుర్గాప్రసాద్‌ సూచించారు. నగర శివారులోని బోర్గాం(పి) ప్రాథమిక పాఠశాల, మోపాల్‌లోని కేజీబీవీని డీఈవో మంగళవారం సందర్శించారు. ఈ నెల 3 నుంచి నిర్వహించే పరీక్షల్లోని ఓఎంఆర్‌ షీట్లపై విద్యార్థులకు జాగ్రత్తగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం భోజనశాల, తరగతి గదులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌వోలు సుప్రజ, శ్రీవేణి, రచన, అంజలి, స్వప్న, సిబ్బంది ఉన్నారు.



జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



నిజామాబాద్‌నాగారం: జాతీయ స్థాయి ఎంఎల్‌బీ కప్‌ బేస్‌ బాల్‌ చాంపియన్‌ పోటీలకు జిల్లా నుంచి 9 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బేస్‌ బాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎల్‌.మధుసూదన్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేంద్ర చారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 2 నుంచి 6 వరకు పంజాబ్‌లో నిర్వహించే పోటీలకు క్రీడాకారులు ఎంపికై నట్లు పేర్కొన్నారు. జట్టుకు కోచ్‌లుగా నరేశ్‌, అనిల్‌ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బేస్‌బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి శ్వేత, మర్కంటి గంగా మోహన్‌, సొప్పరి వినోద్‌, రాజేందర్‌ పాల్గొన్నారు.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్‌ఎస్‌



మాక్లూర్‌: బీఆర్‌ఎస్‌ని వీడి బీజేపీలో చేరిన చిన్నాపూర్‌ ఉపసర్పంచ్‌ హైమద్‌పాషా, రాంచంద్రపల్లికి చెందిన ఇద్దరు బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు 24 గంటలు గడువక ముందే తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఇందులో ఎవరి ప్రమేయం లేదని తమ నిర్ణయం సరైంది కాదని భావించి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరినట్లు వారు వెల్లడించారు.

సిద్ధాపూర్‌లో రైతు సదస్సు

బోధన్‌రూరల్‌: మండలంలోని సిద్ధాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులతో రైతు సదస్సు, శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు వివిధ రకాల పంటల సాగు, సాంకేతిక పద్ధతులు, సూక్ష్మ పోషకాల పోషణ, భూసార పరీక్షలు, స్మార్ట్‌ ఫార్మింగ్‌ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అధికారులు అంజయ్య, జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌ హుస్సేన్‌, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

బీడీలు నేను చేస్తా..నువ్వు చేతికి ఓటెయ్‌!



కామారెడ్డి టౌన్‌: ఎన్నికల హంగామా మొదలైంది. ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ప్రచారంలో తమదైన శైలిలో ఓటర్లకు గాలం వేస్తున్నారు. ఓట్ల కోసం ఓటర్లను ఆకర్షించుకునేందుకు నానా తంటాలు పడటం మొదలయ్యాయి. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్‌ పట్టణ శాఖ ఆధ్వర్యంలో 21, 22వ వార్డుల్లో ప్రచారం చేశారు. వార్డులో బీడీలు చుడుతున్న ఓ మహిళ చాటను తీసుకుని కాంగ్రెస్‌ నాయకులు బీడీలు చుట్టి ఓట్లు వేయాలని వేడుకున్నారు. బీడీ కార్మికులను ఆదుకుంటామని చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

క్రైం కార్నర్‌

తనిఖీల్లో నగదు పట్టివేత



వర్ని/ధర్పల్లి: వర్ని మండల కేంద్రంలో నిర్వహించిన వాహనాల తనిఖీలో ఒకరి నుంచి రూ. రెండు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్‌ మంగళవారం తెలిపారు. కూనీపూర్‌కు చెందిన గోపాల కృష్ణ ద్విచక్ర వాహనంపై వస్తుండగా తనిఖీల్లో నగదు లభించిందన్నారు. సరైన ఆధారాలు లేక పోవడంతో నగదును సీజ్‌చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ధర్పల్లి మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయం వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా బైకుపై వెళ్తున్న ఒకరి నుంచి రూ.1.20 లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్‌ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జక్రాన్‌పల్లిలో రూ. 1.50 లక్షలు..



జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్‌ శివారులో వాహనాల తనిఖీ చేపడుతుండగా రూ. 1.50 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఏఎస్సై సుశీల్‌కుమార్‌, సిబ్బంది ఉన్నారు.

టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు



ఇందల్వాయి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు ఎంపీడీవో రాములు నాయక్‌ తెలిపారు. డబ్బు, బంగారం తీసుకెళ్లే వారు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రహదారుల పైనే కాకుండా రాత్రి వేళల్లో గ్రామాల్లో, మండల కేంద్రాల్లో కూడా తనిఖీలు చేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

నందిపేటలో..



నందిపేట్‌: మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మాక్లూర్‌కు చెందిన కోపుల మధుసూదన్‌ కారులో రూ. 57,960 నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్‌ చేసినట్లు తెలిపారు.

బెల్ట్‌ షాప్‌పై దాడి

బోధన్‌రూరల్‌: మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో బెల్ట్‌ షాప్‌పై దాడి చేసి రూ.5300 విలువ గల మద్యాన్ని సీజ్‌ చేసినట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ మంగళవారం పేర్కొన్నారు. మండలంలోని గ్రామాల్లో ఎవరైనా బెల్ట్‌ షాప్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో అత్తింటి వేధింపులకు వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. నగరంలోని 4వ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని ఎల్లమ్మగుట్టలో నవిత (31) అనే వివాహిత సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది. కామారెడ్డి పట్టణంలోని చిన్న కసాబ్‌ గల్లీలో నివాసముంటున్న బాల్‌రాజ్‌, రాధాగౌడ్‌ దంపతుల కుమార్తె నవితను జిల్లా కేంద్రానికి చెందిన వరుణ్‌గౌడ్‌తో 2015లో వివాహం జరిగింది. పెండ్లికి రూ. 25 లక్షల కట్నం ఇచ్చి వివాహం చేశారు. నవిత నగరంలోని ఓ ప్రైవేట్‌ ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా పని చేస్తోంది. వీరికి ఒక పాప ఒక బాబు ఉన్నారు. సాఫీగా జరుగుతున్న వీరి జీవితంలో ఏం జరిగిందో ఏమో కానీ సోమవారం రాత్రి నవిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో వరుణ్‌గౌడ్‌ తన పిల్లలు, కుటుంబసభ్యులతో కలిసి పరారీ అయ్యారు. మృతురాలి తల్లిదండ్రులు మాట్లాడుతూ అత్తింటి వేధింపులకే తమ కుమార్తె తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో టౌన్‌ ఎస్సై సంజీవ్‌ తెలిపారు. నవిత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో బంధువులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

భార్య హత్య కేసులో జీవితఖైదు

ఖలీల్‌వాడి: భార్యను హత్య చేసిన భర్తకు జీవిత కారాగార శిక్షతోపాటు ఏడు ఏండ్ల జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్‌ సెషన్స్‌ జడ్జి సునీత కుంచాల మంగళవారం తీర్పు వెల్లడించారు. నగరంలోని సీతారాంనగర్‌ కాలనీకి చెందిన గద్దల గణేశ్‌కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య నిర్మలకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిర్మలతో విభేదాలు ఉండటంతో మాక్లూర్‌ మండలంలోని బొంకన్‌పల్లికి చెందిన రాణిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఒక కూతురు జన్మించింది. రాణి జిల్లా కేంద్రంలోని ప్రయివేటు ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తోంది. రెండో భార్య రాణిపై అనుమానం పెంచుకున్న అతను హత్య చేయాలని పథకం పన్నాడు. 04.10.2022న ఎల్లమ్మగుట్ట నుంచి ఆమెను ఆటోలో మాక్లూర్‌ మండలంలోని ముల్లంగి గ్రామ శివారులోకి తీసుకెళ్లి చీర కొంగుతో మెడ చుట్టూ బిగించి హత్య చేశాడు. అనంతరం మృతదేహంపై పెట్రోల్‌ పోసి నిప్పంటించాడు. విచారణలో గణేశ్‌ నేరానికి పాల్పడినట్లు రుజువు కావడంతో జడ్జి జీవిత కారాగార శిక్ష రూ.2 వేల జరిమానా విధించారు. మృతదేహాన్ని కాల్చివేసి సాక్ష్యాన్ని రూపుమాపడానికి ప్రయత్నించిన నేరానికి 7 ఏండ్లు కఠిన జైలుశిక్ష తోపాటు రూ. వెయ్యి జరిమానా విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని సెషన్స్‌ జడ్జి సునీత తమ తీర్పులో పేర్కొన్నారు. దీంతో ఒంటరైన కూతురుకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరఫున తగిన ఆర్థిక పరిహారం అందించాలని జడ్జి తమ తీర్పులో సిఫార్సు చేశారు.

లారీని ఢీకొన్న కారు..

- ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు


మృతి చెందిన జబీయుల్లా


నుజ్జునుజ్జయిన కారు

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు మతపరమైన ప్రార్థనా కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఫార్చునర్‌ వాహనంలో నిజామాబాద్‌ వెళ్లారు. అక్కడి నుంచి బెంగళూరు వెళ్లేందుకు హైదరాబాద్‌ ఎయిర్‌పోర్టుకని మంగళవారం వేకువ జామున బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం క్యాసంపల్లి సమీపంలోకి రాగానే అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొన్నది. ప్రమాదంలో కారులో ఉన్న జబీయుల్లా (57) అక్కడికక్కడే మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఎండీ అనాస్‌, ముజుముల్‌, హఖానీ, షేక్‌ జాఫర్‌ను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

ఎడపల్లిలో ఒకరి అదృశ్యం

ఎడపల్లి: మండల కేంద్రానికి చెందిన గుమ్ముల సువర్ణ ఈ నెల 27న అదృశ్యమైనట్లు కుటుంబీకులు మంగళవారం తెలిపారు. 27న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సువర్ణ భర్త ప్రవీణ్‌ పేర్కొన్నారు.

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

సిరికొండ: మండలంలోని న్యావనందిలో 2019లో జరిగిన దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ. ఐదు వేల జరిమానా విధిస్తు ఆర్మూరు కోర్టు న్యాయమూర్తి వేముల దీప్తి మంగళవారం తీర్పు చెప్పినట్లు కోర్టు కానిస్టేబుల్‌ నరేశ్‌ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన సునుగురి మహిపాల్‌పై అదే గ్రామానికి చెందిన వినోద్‌ కర్రతో తలపై కొట్టి దాడి చేశాడు. ఘటనలో గాయపడ్డ మహిపాల్‌ సిరికొండ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టు నందు చార్జిషీట్‌ దాఖలు చేశారు. ఫిర్యాదుదారు తరఫున అసిస్టెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజేశ్వరి వాదనలు వినిపించారు. వాదోపవాదాల తర్వాత న్యాయమూర్తి నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించినట్లు పీసీ తెలిపారు.

రుద్రూర్‌లో ఒకరి మృతి



రుద్రూర్‌: మండల కేంద్రంలో పాత వర్ని గ్రామానికి చెందిన కొప్పుల సాయిలుకు గుండెలో నొప్పి రావడంతో (50) మృతి చెందినట్లు ఎస్సై నీరేశ్‌ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం లేవగానే సాయిలుకు గుండెనొప్పి ఉందని భార్య బాలమణికి చెప్పడంతో కల్లు తీసుకురావడానికి వెళ్లింది. సాయిలుకు నిత్యం కల్లు సేవించే అలవాటు ఉంది. బాలమణి ఇంటికి వచ్చేసరికి సాయిలు మృతి చెందాడు. గుండెనొప్పితో మృతి చెంది ఉంటాడన్న మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.